క్లుప్తంగా

ఎస్ఎస్‌పీటీ ఆర్థిక సహాయం



సూరిబాబుకు నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు, వరప్రసాద్

సీతానగరం: మండలంలోని జోగింపేట గ్రామానికి చెందిన ఎస్ఎస్‌పీటీ సేవాసంఘం సభ్యులు జోగింపేట కాలనీకి చెందిన వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకుని సోమవారం ఆర్థిక సహాయం చేశారు. పార్వతీపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న నల్ల సూర్యనారాయణ అలియాస్ సూరిబాబు ఇటీవల బ్రెయిన్ సంబంధిత వ్యాధికి గురై ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో సేవాసంఘం సభ్యులు సూరిబాబు ఇబ్బందుల దృష్ట్యా సంఘం తరపున రూ.20,000లు అందజేశారు. వితరణ చేసిన వారిలో ఎస్ఎస్‌టీపీ సేవా సంఘం అధ్యక్షుడు టంకాల శ్రీనివాసరావు, పి వరప్రసాద్, ఎం.తాతబాబు ఇతర సభ్యులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, సిబ్బంది

సాలూరు: ప్రభుత్వ వైద్యారోగ్య శాఖలోని ప్రభుత్వ ఆస్పత్రులు, బోధన కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ శానిటేషన్ సెక్యూరిటీ విభాగాల సిబ్బంది సంక్షేమార్థం రాష్ట్రంలో తలపెట్టిన ఆరో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఏపీ శ్రామిక మహిళా ఫోరం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బలగ రాధ కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందితో కలిసి రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విశ్వేశ్వరరావు, శివ స్వామి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వేసి..వదిలేశారు..!



మెయిన్‌రోడ్డు గుండా ఏరియా ఆస్పత్రికి వెళ్లే మార్గంలో రూరల్ సీఐ కార్యాలయం పక్కన తవ్వేసి వదిలేసిన రోడ్డు గుంతలు

సాలూరు: పట్టణంలో రోడ్లు మరమ్మతులు చేపడుతున్నామని తెలిపిన అధికారులు ఉన్న రోడ్లు తవ్వి విడిచిపెట్టేశారు. రోడ్లు తవ్వి సుమారు వారం రోజులవుతున్నా నేటికి వాటికి చేపట్టాల్సిన పనులు కనిపించడం లేదు. మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ నిధులతో ఈ పనులు చేపడుతుండగా, జనరల్ ఫండ్ నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా మెయిన్ రోడ్డు గుండా ఏరియా ఆసుపత్రికి వెళ్లే మార్గం గుండా రోడ్లను తవ్వేసి వారం రోజులయినా పూర్తిచేయకుండా వదిలేశారు. దీంతో అటుగా వెళ్తున్న రోగులు, గర్భిణులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణను వివరణ కోరగా, ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌తో మాట్లాడానని త్వరలోనే మరమ్మతు పనులు పూర్తిచేయిస్తామని తెలిపారు.

శిక్షణ

సీతంపేట: సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు సోమవారం స్థానిక వైటీసీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ నిశ్చల మాట్లాడుతూ.. మహిళా, శిశు సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలుగా పంచాయతీల్లో పాలన సాగించాలని సూచించారు. అనంతరం పాలనకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్డీ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సహాయకురాలు సుప్రియ

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడడంతో ఈ నెల 18న జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఈ క్రమంలో నూర్పిళ్లు చేపట్టేందుకు సిద్ధమవుతున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని అంపిలి వ్యవసాయ సహాయకురాలు పల్లా సుప్రియ సూచించారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో అన్నదాతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అపరాల పంటకు వర్షం అనుకూలిస్తుందని చెప్పారు. అయితే వరి నూర్పులు పూర్తి చేసిన వారు బస్తాలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు.

దళారులే రారాజులు

- తల వంచుతున్న మిల్లర్లు
- బియ్యంలో ఎక్కువగా వస్తున్న బ్రోకెన్
- ఒక ఏసిక్‌కు రూ.60వేల నుంచి 80 వేలవరకు నష్టం
- లబోదిబోమంటున్న వ్యాపారులు

బలిజిపేట:

గత ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలతో మిల్లరు రారాజులా ఉండేవాడు. ఇప్పుడు దళారుల కబంధహస్తాలలో ఇరుక్కుని తలవంచాల్సి వస్తోంది. బియ్యం బ్రోకెన్ పెరిగి ఒక ఏసిక్(433క్వింటాళ్లు)కు 30క్వింటాళ్ల వరకు నూక వస్తోందని, అన్ని విధాలా ఒక ఏసిక్‌కు రూ.60 వేల నుంచి 80వేల వరకు నష్టపోవాల్సి వస్తోందని మిల్లర్లు లబోదిబోమంటున్నారు. ధాన్యం దిగుబడి బాగున్నప్పటికి వాటిని మరపట్టించగా నూకశాతం ఎక్కువగా వస్తోందని దీనివల్ల నష్టపోతున్నామని వాపోతున్నారు. దళారీ రైతు వద్ద 84కేజీలు తూచుకుంటూ మిల్లువద్దకు వచ్చేటప్పుడు 81లేదా 82కిలోల లెక్క చూపెడుతున్నట్లు మిల్లర్లు ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన రైతు, మిల్లరు నష్టపోవడమే కాకుండా దళారీ ఆధిపత్యం చెలాయిస్తున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాన్స్‌పోర్టు కింద ఒక 40కిలోల ప్యాకెట్‌కు రూ.5వంతున ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ అది అందడం లేదని చెబుతున్నారు.

నాడు..

దళారీతనం లేకుండా ధాన్యం మిల్లుకు గత ప్రభుత్వ హయాంలో నేరుగా వచ్చేవి. ఏ రైతు ధాన్యం ఎక్కడి మిల్లుకు వెళ్తాయో ట్రక్‌షీట్ కొట్టేవరకు ఎవరికీ తెలియదు. దళారులు భయపడి వెనకడుగు వేసేవారు. దళారుల ప్రాబల్యం కనిపించేది కాదు. రైతు ఇచ్చే ధాన్యానికే ట్రక్‌షీట్ తెగేది. నేరుగా రైతు ఖాతాలో నగదు జమ అయ్యేది.

- రైతుకు ట్రాన్స్‌పోర్టు సమస్య లేదు. ట్రాన్స్‌పోర్టు మొత్తం రైతు ఖాతాకు జమ అయ్యేది.
- 84కిలోల వంతున రైతు ఇచ్చిన ధాన్యం స్టాకు వేసేటప్పుడు నిల్వవల్ల తరుగు వచ్చేది. అది అక్కడికి సరిపోయేది.



మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం



మరపట్టించిన బియ్యం

- గతంలో ఒక ఏసిక్‌కు 7 క్వింటాళ్ల నూకలు వచ్చేవి. 100కిలోలకు 67కిలోల బియ్యం లెవీ ఇచ్చేవారు. బ్రోకెన్ చాలా తక్కువగా ఉండేది.
- ఒక ఏసిక్‌కు మిగిలిన ఉత్పత్తులు తౌడు వల్ల, ఊకవలన ఒక టన్నుకు రూ.4వేలు ప్రారంభంలో వచ్చేది. తౌడు, ఊక ధరలు నెమ్మదిగా పెరిగేవి.

నేడు..

- దళారుల ప్రాబల్యానికి రెడ్‌కార్పెట్ వేశారు.
- రైతుకు, మిల్లరుకు మధ్య దళారీవ్యవస్థ
- రైతు, మిల్లరు ఇద్దరికీ నష్టం



మిల్లుకు తరలుతున్న ధాన్యం

- అధికారుల పర్యవేక్షణ కరువు
- నచ్చిన మిల్లుకు ట్రక్‌షీట్ విధానంతో మిల్లరు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి
- గతం కంటే అన్ని విధాలా ఒక ఏసిక్‌కు రూ.60వేల నుంచి రూ.80వేల వరకు నష్టం కనిపిస్తోందని మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- గత ప్రభుత్వ హయాంలో జాక్‌పాట్ కొట్టిన మిల్లర్లు ఇప్పుడు చేతులు కాల్చుకోవాల్సి వస్తోందని బావురుమంటున్నారు. పెట్టిన డిపాజిట్‌కు రెండింతల ధాన్యం ఇస్తున్నారు. ట్రక్‌షీట్ వచ్చిన 15రోజులలోపు బియ్యం సిద్ధం చేసి లెవీకి ఇవ్వాల్సి ఉందని చెబుతున్నారు.

ప్రస్తుతానికి నష్టం



మిల్లరు ప్రస్తుతానికి నష్టపోవాల్సి వస్తోంది. ధాన్యం తడి ఆరక ముందే మిల్లులకు రావడం, వెంటనే వాటిని మర పట్టించడంతో బ్రోకెన్ ఎక్కువగా ఉంది. దీనివల్ల కూడా నష్టం వస్తోంది. దళారీతనం పెరగడంతో వారినే ఆశ్రయించాల్సి వస్తోంది.

–కె.రమేష్, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, బలిజిపేట

రైతు మోహనరావుకు ప్రకృతి సేద్య అవార్డు



మోహనరావును సత్కరిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

సీతానగరం: ప్రజలకు ఆరోగ్యకరమైన పోషక విలువలతో కూడిన పంటలు పండించడం మంచి పరిణామమని మండల ప్రకృతి వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఎస్.గంగరాజు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి, అపరాలు, కూరగాయలు పండించిన రైతు బుడితి మోహన్‌రావు ప్రకృతివ్యవసాయ ఆవార్డును విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో అందుకున్నారు. ఈ సందర్భంగా మండల ప్రకృతి వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఎస్.గంగరాజు మాట్లాడుతూ మోహనరావు దీర్ఘకాలంగా ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన దేశీ విత్తనాలతో వ్యవసాయం చేస్తున్నారని తెలియజేశారు.అందుకు గాను విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన ఆర్గానిక్ మేళాలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు బియ్యం, కులాకర, నవారా, మైసూరు, మైసూరు మల్లిక వంటి దేశీ వరి పంట ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించడంలో పలువురికీ ఆదర్శంగా నిలడంతో అవార్డు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: తాగునీటి సమస్య పరిష్కరించాలని పార్వతీపురం మండలంలోని సంగంవలస పంచాయతీ చొక్కాపువానివలస గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిల భారత వ్యవసాయ గ్రామీణ జిల్లా కార్యదర్శి సంఘం ఆధర్యంలో గ్రామస్తులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఆరు నెలలుగా ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉందని అధికారులకు చెబుతున్నప్పటికీ నామమాత్రంగా మరమ్మతులు చేసి వదిలేయడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చిందని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలు, అనుబంధ కమిటీలు నియమించనున్నట్లు చెప్పారు. చురుకైన వారికి కమిటీల్లో స్థానం కల్పించనున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో వైఫల్యాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఈనెల 21న ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మంగయ్య, సర్పంచ్ ఎస్.కూర్మారావు, పార్టీ నాయకులు ఎస్.సాయికుమార్, ఎన్.కృష్ణ, ఆరిక ప్రసాద్, వెంకీ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

ఎవరికోసం కిసాన్ మేళా..!

పాలకొండ రూరల్: కేవలం ప్రజాప్రతినిధుల ప్రసంగాలు మినహా కిసాన్‌మేళా వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయసాగులో మెలకువలు, యాంత్రీకరణ, పెట్టుబడి తగ్గించే విధానం, తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్న మేళాలు పక్కదారి పడుతున్నట్లు ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన కార్యక్రమానికి ఐదు జిల్లాల నుంచి రైతులు వచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. కేవలం ఆర్భాటాల కోసం వ్యవసాయ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో హడావిడి చేయడం మినహా లక్ష్యం నెరవేరకపోవడం వెనుక అధికారుల లోపం ఉందని ఆరోపించారు. ఇకపై కిసాన్ మేళాల్లో రైతులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు.

వంగ సాగులో..

మెలకువలు తప్పనిసరి

- ఉద్యానవన అధికారి అమరేశ్వరి

పాలకొండ రూరల్: వాణిజ్య పంటల్లో అధిక దిగుబడులతో పాటు లాభాలు తెచ్చిపెట్టే వంగ పంటతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానవన అధికారి అమరేశ్వరి అన్నారు. రబీలో వంగ సాగు ఎన్నో లాభాలను తెచ్చి పెడుతుందన్నారు. ఈ పంట సాగు చేస్తున్న రైతులు చిన్న చిన్న మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు కళ్లజూడవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు.

- **సేద్యంలో మెలకువలు..**

నీరు ఇంకే నేలలు ఈ పంటకు అనుకూలం. ఎకరాకు 260 గ్రాముల సూటి రకాలు, సంకరజాతి రకాలైతే 120 గ్రాముల విత్తనాలు అవసరమవుతాయి. శీతాకాల పంటకు 4–5 చదరపు మీటర్ల మడులు తయారు చేసుకోవాలి. ఇవి ఎకరాకు 10 నుంచి 12 సరిపోతాయి. ముఖ్యంగా వంగ పంటలో మొవ్వ, కాయతొలుచు పురుగు మొక్కనాటిన 30 నుంచి 40 రోజుల వ్యవధిలో ఆశిస్తుంది. ఈ పురుగు ఆశిస్తే కాయ వంకర్లు తిరిగిపోతుంది. మొక్కల శివర్లు వాడిపోయి దిగుబడి తగ్గిపోవడం లేదా పంట పోయే అవకాశం కూడా ఉంది. వీటిని గుర్తించినప్పుడు పురుగు ఆశించిన కొమ్మల చివర్లను తొలగించాలి. అలాగే లీటర్ నీటిలో కార్బరిల్ (డబ్ల్యుయూపీ 50శాతం) మూడు గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ రెండు మిల్లీలు కలిపి 10 రోజుల వ్యవధిలో, కాయలు కోసిన తర్వాత పిచికారీ చేయాలి. అలాగే రసంపీల్చు పురుగు అడుగు భాగాన చేరి మొక్కలో రసాన్ని పీల్చేస్తాయి. దీని కారణంగా పచ్చదనం కోల్పోయి పసుపురంగుకు మారి పైకి ముడుచుకుని ఎండిపోతాయి. దీనిని గుర్తించినప్పుడు లీటర్ నీటికి డైమిథోయేట్ లేదా ఫిప్రోనిల్ రెండు ఎం.ఎల్ వంతున కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఎర్రనల్లి ఆశించినప్పుడు ఆకు అడుగు భాగం పాలిపోయి తెల్లగా మారుతాయి. అలాగే ఆకులపై సాలిగూడు వంటి తీగలు ఏర్పడడాన్ని గుర్తిస్తే దీని నివారణకు లీటర్ నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లేదా డైకోఫాల్ 5 ఎం.ఎల్ కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



వంగ పంట

కాయకుళ్లు తెగులు ప్రమాదకరం...



ముఖ్యంగా దిగుబడి చేతికి అందే సమయంలో ఆశించే కాయకుళ్లు తెగులు పెనుసమస్యగా మారే అవకాశం ఉంది. ఈ తెగులు సోకిన మొక్కలకు ఆకులమీద గోధుమ రంగు మచ్చలు కనిపిస్తాయి. ఆకులు మాడి రాలిపోవడంతో పాటు కాయ పసుపురంగులోకి మారి కుళ్లిపోతుంది. దీని నివారణకు లీటర్ నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పది రోజుల్లో రెండుసార్లు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.

– తమ్మినేని అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారి

- **నెల రోజుల వ్యవధిలో..**

నారు నాటిన నెల రోజులకు ఆకుముడత తెగులు సంక్రమించే ప్రమాదం ఉంటుంది. తేమతో కూడిన చల్లని వాతావరణం కారణంగా ఈ తెగులు ఆశిస్తుంది. ఆకులపై గోధుమ రంగు మచ్చలేర్పడి మాడినట్లు గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. లేకుంటే ఈ ఆకులు పసుపు రంగుగా మారి రాలిపోతాయి. దీని కారణంగా మొక్క ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతుంది. దీని నివారణకు లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి 10 రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

ధనుర్మాస పూజలు ప్రారంభం

బలిజిపేట: ధనుర్మాస పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలలో అర్చకులు ధనుర్మాస తొలిరోజు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అందులో భాగంగా వెంగాపురం రామాలయంలో అర్చకుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలను నిర్వహించారు. ధనుర్మాసంలోని విశేష రోజుల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.భక్తులు ధనుర్మాసంలో పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో చేసుకోవడం ఎంతో మంచిదన్నారు. వచ్చేనెల 13వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నామని, మధ్యలో విశేష సేవలు నిర్వహిస్తామని భక్తిశ్రద్ధలతో భక్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు కె.ఫణికుమార్ శర్మ, కె.సూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట సీతారామ దేవస్థానం వద్ద ధనుర్మాస వ్రత మహోత్సవ ప్రత్యేక పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రీరంగం శ్రీరంగనాయకుల విగ్రహ స్థాపన, శ్రీ గోదా రంగనాయకుల పాశుర సమర్పణ తదితర ప్రత్యేక కార్యక్రమాలు ఈ సందర్భంగా వైభవంగా నిర్వహించారు.విద్యుత్ దీపాలంకరణలో అంగరంగ వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్త్రీశిశుసంక్షేమ,గిరిజనసంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణితో పాటు పలువురు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



వెంగాపురం రామాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



పెదకోమటిపేట సీతారామ దేవస్థానం వద్ద జరుగుతున్న ప్రత్యేక పూజలు

సమష్టిగా గ్రామాల్లో అభివృద్ధి పనులు

సీతానగరం: మండలంలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి వివిధ శాఖల అధికార సిబ్బందికి ఇచ్చిన శిక్షణ ఆధారంగా పనులు చేపట్టాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ ఆరు రోజులుగా జరిగిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల వారీగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సహకారంతో వివిధశాఖల అధికార సిబ్బంది ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు సామాజికపరమైన అభివృద్ధి జరగాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు శాఖలు వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూర్ణిమ, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన ఉద్యోగులతో ఎంపీడీఓ త్రివిక్రమరావు, సీహెచ్‌ఓ రమణ, పూర్ణిమ

పెరిగిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలి



పాతబస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

- సీపీఎం నిరసన

పార్వతీపురంటౌన్: పెరిగిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్ద విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దుచేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదానితో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కరెంట్ బిల్లులలో సర్దుబాటు చార్జీలపేర్లతో వచ్చిన అదనపు చార్జీలు తగ్గించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్త ఉద్యమాలు జరుగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వాకాడ ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, రెడ్డి శ్రీదేవి, గొర్లి వెంకట రమణ, పట్టణ కమిటి సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు సంయుక్తంగా ప్రణాళికలు తయారు చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణాభివృద్ధిపై పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు, అధికారుల సమన్వయంతో గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు చేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావుతో పాటు వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో..

గుమ్మలక్ష్మీపురం: స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనపై (ఎల్‌జీఎస్‌డీ) పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయం సిబ్బందికి గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని, శిక్షణలో అందజేసిన సూచనలు పాటించి, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఈఓపీఆర్డి కె.ధర్మారావు శిక్షణను అందించారు.



గరుగుబిల్లి: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం..

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన వలరౌతు రవణమ్మ(67), నిమ్మల జానకమ్మ(81) వేర్వేరు దుర్ఘటనల్లో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధిత కుటంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆమె వెంట వైఎస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, పాలక ఉషారాణి, సర్పంచ్ జామి ప్రభాకర్, పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, కార్యకర్తలు న్నారు.